నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

ప్రమాదకరంగా విద్యుత్ స్థంభం

నవతెలంగాణ-బోధన్

బోదన్ పట్టణంలోని హరిజనవాడలో విద్యుత్ స్థంభం పాతిన గుంతకు సంబంధించిన మట్టి వర్షానికి తొలగిపోయి స్థంభం ప్రమాదకరంగా మారింది. దాంతో స్థంభం ఈదురు గాలులకు, భారీ వర్షాలకు పడిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్థంభం ప్రమాదకరంగా మారిందని దానిని సరిచేయాలని కాలనీవాసులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


స్థంభం పక్క నుంచి తొలిగిన మట్టి

నాటు వేసే చోటే వంట..

నవతెలంగాణ-బోధన్

ప్రస్తుతం యాసంగి సీజన్‌లో భాగంగా వరి నాట్లు ప్రారంభం కావడంతో పలువురు రైతులు వరి నాట్లు వేసుకోవడానికి ఇతర జిల్లాలకు చెందిన కూలీలను ఆశ్రయిస్తున్నారు. దాంతో బీహార్, కలకత్తా రాష్ట్రాలకు చెందిన కూలీలు సాలూరా మండల సమీపంలో వరి నాట్లు వేస్తున్నారు. ఎంత చలిగా ఉన్నా ఉదయం ఆరు గంటలకే పొలాల్లో నాట్లు వేయడానికి పూనుకుంటున్నారు. 15 మంది సభ్యులుగా ఉన్న కలకత్తా కూలీలు పొలం గట్లపైనే గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకుని అక్కడే భోజనం చేస్తూ వరి నాట్లు పూర్తి చేస్తున్నారు. దీంతో వారికి చేతినిండా పని లభిస్తుంది. ఆదివారం కొప్పర్తి క్యాంప్ సమీపంలో కలకత్తా రాష్ట్రానికి చెందిన కూలీలు పొలం గట్టునే వంట చేసుకుని భోజనం చేస్తున్న దృశ్యం నవతెలంగాణ కెమెరాకు చిక్కింది.


పొలం గట్టున వంట చేసి భోజనం చేస్తున్న కూలీలు

వసూళ్ల దందా ఆపేనా..?

44వ జాతీయ రహదారిపై అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడానికి, ఇతర రాష్ట్రాల నుంచి నిషేధిత పదార్థాలు రవాణా కాకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ విధులు నిర్వహించాల్సిన ఆర్టీవో చెక్ పోస్ట్ తనిఖీల మాట దేవుడెరుగు వసూళ్లకు మాత్రం అడ్డాగా మారింది. ఒక్కో లారీని తనిఖీల పేరుతో ఆపి పేపర్లు చూడకుండా, తనిఖీలు చేయకుండానే లారీ డ్రైవర్ వద్ద సుమారు రూ.500 నుంచి 2000 వరకు వసూలు చేస్తున్నారు. ఈ దందా కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఆర్టీవో కార్యాలయంలో జోరుగా సాగుతుందని లారీ డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.



చెక్‌పోస్టు వద్ద అడ్డుగా వచ్చి లారీలను ఆపుతున్న బ్రోకర్లు

- ఉదయం కర్రలు.. రాత్రి టార్చ్ లైట్‌లతో అడ్డగింత
- అధికారుల తనిఖీలు నిల్.. అక్రమార్కుల వసూళ్లు ఫుల్
- ప్రమాదాలకు అడ్డాగా చెక్ పోస్ట్


వాహనాలను ఆపుతున్న బ్రోకర్లు

నవతెలంగాణ-భిక్కనూర్

రహదారిపై వెళ్తున్న లారీలను ఉదయం పూట చెక్ పోస్ట్ వద్ద ఉన్న బ్రోకర్లు కర్రల సహాయంతో ఆపడం, లారీ ఆపకుండా వెళితే కర్రలతో కొట్టడం లాంటివి చేస్తున్నారని, రాత్రి సమ యంలో లారీ డ్రైవర్లకు కంటికి తగిలేలా టార్చ్ లైట్ వేస్తూ లారీని ఆపుతున్నారని, ఒకవేళ లారీ డ్రైవర్ ఆపడం లేదని ముందే గ్రహిస్తే లారీకి అడ్డు వస్తున్నా రని లారీ డ్రైవర్లు చెబుతున్నారు. తీరా లారీని ఆపితే తనిఖీలు చేయకుండా ఆఫీసులోకి వెళ్లి సార్‌ని కలిసి వెళ్లాలని బ్రోకర్లు సూచిస్తున్నట్లు సమాచారం.

బ్రోకర్లు సడన్‌గా లారీని ఆపడం కారణంగా లారీ డ్రైవర్లు ఒక్కసారిగా లారీని ఆపడంతో వెనుక నుంచి వచ్చే వాహనదారులకు వాహనాలు కంట్రోల్ కాక లారీని ఢీకొని ప్రమాదాలు జరగడం, మరణించిన ఘటనలు సైతం ఉన్నాయి. ఆర్టీవో చెక్‌పోస్ట్‌లో అధికారుల కంటే బ్రోకర్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ బ్రోకర్లే ప్రమాదాలకు, వసూళ్లకు ప్రధాన కారణమని, అధికారులు తనిఖీలకు వచ్చిన ముందుగా సమాచారం ఇచ్చేది ఈ బ్రోకర్‌లేనని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

గతంలో ఎన్ని వసూలు చేసినా, ఎన్ని ప్రమాదాలు జరిగినా అటు రాష్ట్ర ప్రభుత్వం కానీ, ఇటు ఉన్నతాధికారులు కానీ చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ప్రస్తుతం ప్రభుత్వం మారిన కారణంగా బ్రోకర్లను తొలగించి, అడ్డూఅదుపు లేకుండా చెక్‌పోస్ట్ వసూళ్ల దందాకు అడ్డుకట్టపడేనా అని లారీ డ్రైవర్లు, వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటానన్న కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి చెక్‌పోస్ట్ దందాను నియంత్రిస్తా..?, లేదా..? అనేది వేచి చూడాల్సి ఉంది.


గోపన్‌పల్లి గుట్ట వద్ద ఇసుక డంప్‌లు


పోలీసులు పట్టుకున్న నెంబర్ ప్లేట్‌లేని టిప్పర్

మంజీరాలో ఇసుక తవ్వకాలు

- పక్క రాష్ట్రాలకు అక్రమ రవాణా
- రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా డంపులు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలో ఇసుక అక్రమ రవాణా చాప కింద నీరులా జడలు విప్పుతోంది. అధికారుల కుమ్మక్కుతో ఇసుక మాఫియా రెచ్చిపోయి ఇసుక రవాణా చేయడంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా రోజు లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

బిచ్కుంద మండలంలోని మంజీర పరివాహక ప్రాంతాలైన షట్లూర్, ఖత్గాం, హస్గుల్, పుల్కల్ గ్రామాలకు చెందిన కొందరు ఇసుక అక్రమ రవాణా మాఫీయాగా ఏర్పడి అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా షట్లూర్, ఖత్గాం, మెక్కా, హస్గుల్, గ్రామ శివారులో గోపన్‌పల్లి, పుల్కల్ గ్రామ సమీపానగల గుట్టల్లో ఇసుక రవాణా చేసి డంపులు వేసి రాత్రి సమయాల్లో లారీలు, టిప్పర్ల ద్వారా పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్నారు. తద్వారా లక్షల్లో అక్రమ ఆదాయం ఆర్జిస్తున్నారు. గత వారం రోజులుగా ఇసుక రవాణా జరుగుతున్న విషయాన్ని సమీప గ్రామాల ప్రజలు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై అధికారుల కనుసన్నల్లోనే అక్రమ ఇసుక రవాణా కొనసాగుతోందని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ అధికారులు గానీ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా మాఫియా జీరో దందాకు తెర లేపి ఇసుక రవాణా పేరుతో ఈ ప్రాంత వనరులను రాత్రి సమయాల్లో తరలించి ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో నష్టం చేకూరుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ రోజు లక్షల్లో ఆదాయం..

డంపులుగా వేసిన ఇసుకను లారీలు, టిప్పర్ల ద్వారా నింపి ఒక్కో లారీకి 35 వేల నుంచి 40 వేల రూపాయలు వసూలు చేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ రోజు లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. రోజుకు 50 వరకు లారీలు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఇసుక మాఫియా దారులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ రోజుకు 15 నుంచి 20 లక్షల ఆదాయం సమకూర్చుకుంటున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు ఇటువైపు చూడకపోవడం గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇసుక మాఫియా ఆడిందే ఆట పాడిందే పాటగా అక్రమ ఇసుక రవాణా చేస్తూ లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

ప్రాణాలు తీస్తున్న ఇసుక గుంతలు..

జెసిబితో ఎక్కడబడితే అక్కడ లోతులో తవ్వకాలు జరపడంతో ఇసుక గుంతలు ప్రమాదకరంగా మారి అమాయక ప్రజల, పశువుల ప్రాణాలు తీస్తున్నాయి. వాగు దాటుతూ తవ్విన గుంతల లోతు తెలియక ప్రజలు, పశువులు నీట మునిగి చనిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. పుల్కల్ మంజీరా పరివాహక ప్రాంతం నది నడిబొడ్డున జరుపుతుండడంతో గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని నిబంధనలకు విరుద్ధంగా నదిలో ఇసుక తవ్వకాలు ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నామమాత్రపు జరిమానా విధింపులు..

గతంలో పట్టుకున్న లారీలను, ట్రాక్టర్లను పోలీసులు రెవెన్యూ అధికారులు నామమాత్రపు కేసులు నమోదు చేసి కొద్దిపాటి జరిమానాలు విధించి వదిలి వేయడంతో అక్రమ ఇసుక రవాణా మాఫియా రెచ్చిపోయి అధికారుల కనుసన్నల్లోనే ఇసుక రవాణా వ్యవహారం కొనసాగుతున్నట్లు ప్రజల ఆరోపిస్తున్నారు.

నంబర్ ప్లేట్ లేని టిప్పర్ పట్టుకున్న పోలీసులు..

శనివారం జిల్లాస్థాయి పోలీస్ అధికారుల ఒత్తిడి రావడంతో పోలీసులు నైట్ పెట్రోలింగ్ నిర్వహించి ఇసుక రవాణా అవుతున్న నంబర్ ప్లేట్ లేని టిప్పర్‌ను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి మైన్స్ అధికారులకు అప్పజెప్పనున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు.

పల్లెకు రాని ఆర్టీసీ బస్సులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదు. దీంతో పలు గ్రామాల ప్రజలు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మండలంలోని అబం(వై), ఏఆర్‌పీ క్యాంప్, బ్రాహ్మనపల్లి, జైతాపూర్, జంలం, తానాకలాన్ తదితర గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు రావడం లేదు. గతంలో నిజామాబాడ్ డిపో బస్సు పాఠశాల కళాశాల, పిల్లల కోసం వచ్చేది. అలాగే ప్రజల కోసం సైతం బస్సులు రాకపోకలు సాగించేవి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. కానీ



మండలంలోని పలు గ్రామాలకు బస్సులు రాకపోవడంతో తాము ప్రయాణం చేసేదెలా అని మహిళలు ప్రశ్నిస్తున్నారు. బస్సులు రాని గ్రామాల ప్రజలు ఎడపల్లి, జానకంపేట్, శాటాపూర్ గేట్ వద్ద బస్సులు ఎక్కి.. ఇతర గ్రామాలకు వెళ్తున్నారు.

కూలిన బ్రిడ్జి

- ధాన్యం డీసీఎం బోల్తా
- గాయాలతో బయటపడ్డ డ్రైవర్


బోల్తాపడిన డీసీఎం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని లొంక తండా సమీపంలో గల బ్రిడ్జి ఆదివారం కూలిపోయింది. ధాన్యం లోడుతో డీసీఎం వ్యాన్ వంతెన పైనుంచి వెళ్తుండగా బ్రిడ్జి కూలడంతో డీసీఎం కాలువలోకి పడింది. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో తండావాసులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా బ్రిడ్జి పరిస్థితి గురించి బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు లొంకతండా సర్పంచ్ ప్రేమ్ వినతిపత్రం ఇవ్వగా కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం హామీఇచ్చారని, కొందరు నాయకుల వల్ల నిర్మాణం చేపట్టకుండా అడ్డుకున్నారని సర్పంచ్ ప్రేమ్ ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని తాండావాసులు కోరుతున్నారు.

ఎస్‌డిఎఫ్ఐ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు ఎస్సీ కాలనీలో ఆదివారం జీవధాన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో భారతీయ క్యాథలిక్ సిస్టర్స్ అండ్ డాక్టర్స్ ఫోరం (ఎస్‌డిఎఫ్ఐ) అనుబంధ సంస్థ వారు ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరంలో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అని హితవు పలికి నిరాశ్రయులకు, నిర్భాగ్యులకు, నిస్సహాయులకు సేవలు అందించిన మదర్‌థెరిస్సా స్ఫూర్తితో వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రికి వెళ్ళలేని నిస్సహాయుల కోసం ఈ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశా మని తెలిపారు. బిపి, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిచామని, అంతేకాక గ్రామీణ జీవన విధానంలో వచ్చే వివిధ రోగాల గురించి, వాటి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఏంజెల్, డాక్టర్ లిల్లీ, జీవధాన్ ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

బడిబయటే బాల్యం

- ఇటుక బట్టీల వ్యాపారుల వద్ద మగ్గుతున్న చిన్నారులు
- నామమాత్రంగా కొనసాగుతున్న సర్వే
- ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయని అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

ఓనమాలు దిద్దేవయసులో వలస కార్మికుల పిల్లలు.. బట్టీల్లోనే బాల్యం గడుపుతున్నారు. బడి బయట పిల్లలను గుర్తించి జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక సర్వే చేపట్టాలని ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం సర్వే నామమాత్రంగా కొనసాగుతుంది. వలస కార్మికుల పిల్లలను గుర్తించిన ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యాధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు. చిన్నారుల జీవితాలు ఇటుక బట్టీలలో, భవన నిర్మాణ పని జరిగే చోట, వ్యాపారుల వద్ద మగ్గిపోతున్నాయి. దీంతో బడి ఈడు పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు.

ఓనామాలు రాయాల్సిన పిల్లలు అనివార్య కారణాల వలన చదువును మధ్యలో ఆపేసి పిల్లలు, మరికొంతమంది తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడం చదువుల తల్లికి దూరమైన పిల్లలు పలుక పుస్తకాలు పట్టాల్సిన చేతులు ఇటుక బట్టీల్లోనూ, భవననిర్మానం జరిగే చోట వ్యాపారుల పనిచేస్తూ కనిపిస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించేందుకు ప్రభుత్వం బడి బయట సర్వేను ప్రారంభించింది. వచ్చే నెల 10వ తేదీ వరకు బడి బయట పిల్లల సర్వే కొనసాగించాలని ఆదేశించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అంతంత మాత్రంగానే కొనసాగుతుంది. అదేవిధంగా ఇతర జిల్లాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పొట్ట చేత పట్టుకొని ముల్లె మూట సర్దుకొని పిల్లజెల్లతో చెరుకు నరికేందుకు వచ్చిన వలస కార్మికుల గ్రామాల్లో గుడిసెలు వేసుకొని మూడు నెలల పాటు చెరుకు నరికే పనుల్లో నిమగ్నమవుతున్నారు. వారి పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. బాల్యం బడి బయట గడపడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి సమీపంలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ, నిజాంసాగర్ మండలంలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ ఉన్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక, నారాయణఖేడ్, జహీరాబాద్‌తో పాటు తదితర ప్రాంతాలకు చెందిన వలస కార్మికులు చెరుకు నరికేందుకు 1500 కుటుంబాలకుపైగా వలస వచ్చాయి. గ్రామాల్లో గుడిసెలు వేసుకొని తమ పిల్లలను గుడిసెలకే పరిమితం చేసి వలస కార్మికులు పనుల్లో నిమగ్నమవుతున్నారు. వారి పిల్లలు మాత్రం చదువుల తల్లికి దూరమవుతున్నారు. జిల్లా స్థాయి విద్యాధికారులు వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు జిల్లాలో ఎక్కడ కూడా ఏర్పాటు చేయలేదు.

గత సంవత్సరం ఈపాటికి వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేశారు. ఒకవైపు బడి బయట పిల్లల కోసం జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న బడి బయట పిల్లల గురించి బడిలో చేర్పిస్తున్న వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు ఆయా భాషలలో ఏర్పాటు చేయకపోవడంతో సర్వత్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు వలస కార్మికుల పిల్ల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు

గ్రామాల్లో కొనసాగుతున్న బడి బయట సర్వే..

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు డిసెంబర్ 10 నుంచి జనవరి 10 వరకు బడి బయట సర్వే నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాలలో వ్యాపార సముదాల వద్ద, ఇటుక బట్టీల వద్ద బడి బయట పిల్లలు ఉన్నారని సమాచారం రావడంతో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ సంబంధిత ప్రధానోపాధ్యాయులతో అక్కడికి వెళ్లి బడిబయట పిల్లలను గుర్తించి మరీ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ సంబంధిత పాఠశాలలో చేర్పిస్తున్నారు. అదేవిధంగా ఆర్థిక స్థోమత లేక అర్ధాంతరంగా పాఠశాలను మానేసిన విద్యార్థులను గుర్తించి వారికి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బడి బయట సర్వే కొనసాగు తుంది. ఎప్పటికప్పుడు పిల్లల వివరాలను మండల విద్యాధికారికి జిల్లా విద్యాధికారికి వివరాలు అందిస్తున్నారు. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాలలోపు, 15 సంవత్సరాల నుంచి 19 ఏండ్లలోపు వలస వచ్చిన పిల్లల కోసం సర్వే చేస్తున్నారు. 15 నుంచి 19 సంవత్సరాల వరకు ఓపెన్ టెన్త్ పరీక్షలు రాయించడానికి అధికారులు సన్నహాలు చేస్తున్నారు.


బడిబయట పిల్లలను గుర్తిస్తున్న ఉపాధ్యాయులు

వలస కార్మికుల పిల్లలు అధికం..

కామారెడ్డి జిల్లాలో వలస కార్మికుల పిల్లలే పని జరిగే ప్రదేశంలో దర్శనమిస్తున్నారు. మండలంలో గ్రామీణ ప్రాంతాల్లో ఇటుక బట్టీల వద్ద, అదేవిధంగా భవన నిర్మాణం జరిగే చోట, చెరుకు నరికేందుకు వచ్చిన వలస కార్మికుల నివాస గుడిసెల వద్ద బాల కార్మికులు దర్శనమిస్తున్నారు. నూతనంగా భవన నిర్మాణానికి చత్తీత్‌ఘడ్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల నుంచి వలస వస్తున్నారు. వారి పిల్లలను బడిలో చేర్పించకుండా పనులు జరిగే చోటే ఉండడంతో ప్రత్యామ్నాయ వారి భాషలకు సంబంధించిన పాఠ్య పుస్తకాలను అందుబాటులో ఉంచి విద్యావాలంటీర్లు ఏర్పాటు చేసి బోధించాల్సి ఉంది.

కానీ ఇప్పటివరకు ఏర్పాటు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారని పలువురు మండిపడుతున్నారు. జిల్లాలో రామారెడ్డి, సదాశివనగర్, లింగంపేట్, కామారెడ్డి, రాజంపేట్ ప్రాంతాల్లో చెరుకు పంట సాగుచేస్తారు. అదేవిధంగా ఇటుక బట్టీలు ఎల్లారెడ్డితో పాటు ఆయా మండలాల్లో ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. మే నెల వరకు ఇటుక బట్టీల వారి పిల్లలు చదువులకు దూరమవుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. ఏది ఏమైనప్పటికీ వలస కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ శాఖ అధికారులు స్పందించరా ?

కార్యాలయాలకే పరిమితం

నవతెలంగాణ -కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారని జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లిలో ఆరేపల్లి రోడ్డుకు వెళ్లే దారిలో ఓ వ్యక్తి తన పొలానికి అర కిలోమీటర్ వరకు ఎలాంటి స్తంభాలు లేకుండా సర్వీస్ వైరు కట్టెలకు కట్టి తీసుకువెళ్లడంతో వాహనదారులకు ఇబ్బందికరంగా ఉన్న అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆ రోడ్డు వెంబడి వెళ్లాలంటే టిప్పర్ సైతం ఆగి చూసి వెళ్ళవలసి ఉంటుంది. ఏ మాత్రం ఆదమరిచిన ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు వచ్చి నామాత్రంగా విచారణ చేసి మాత్రమే వెళుతున్నారు. ఆయన డిడి కట్టకపోయినా అధికారులు మాత్రం డీడి కట్టాడని త్వరలోనే పర్మిషన్ వస్తుందని చెప్తున్నారు తప్ప ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయం జరిగితే దానికి ఎవరు బాధ్యులని వాహనాదారులు విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. చెట్లపై నుండి కట్టెలపై నుండి సర్వీస్ వైర్ రావడంతో ఎప్పుడూ ఏ కట్టే విరుగుతుందో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆ చుట్టుపక్కల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కర్రల సాయంతో విద్యుత్‌వైర్

ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-జుక్కల్

ప్రమాదవశాత్తు నీటమునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన జుక్కల్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. జుక్కల్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సురేష్ (32) హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. ఇటీవలే తండ్రి గంగారాం మరణించడంతో స్వగ్రామానికి సురేష్ తల్లితో కలిసి వచ్చాడు. అయితే ఇల్లు శుభ్రంలో భాగంగా ఇంటికి సున్నం వేసి, బట్టలు ఉతకడానికి డిసెంబర్ 13వ తేదీన పూజారీ చెరువుకు వెళ్లాడు. స్నానం చేస్తానని తల్లితో చెప్పి నీటిలో దిగాడు. గుంతలో లోతు ప్రాంతం వరకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీట మునిగాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం శవం ఒడ్డుకు వచ్చి చేరడంతో స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అన్న చాకలి సుభాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు చాకలి సురేష్‌కు భార్య, పిల్లలు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన గౌస్ పాషా కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. ముగ్గురు కూతుర్ల తర్వాత ఇర్ఫాన్ 17 సంవత్సరాలు చిన్నవాడు. రెండు నెలల కింద అనారోగ్యానికి గురికాగా పలు హాస్పిటల్లో చూపించగా బ్లడ్ క్యాన్సర్ ఉందని నిర్ధారణ అయింది.. లక్షల్లో ఖర్చు అవుతుందని తెలిసి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో క్లాస్‌మెంట్ యూత్ తరపున 30 వేల రూపాయలు, కింగ్స్ యూత్ ఫౌండేషన్ సభ్యులు చికిత్స కోసం 20వేలు, వైష్ణవి బియ్యం దుకాణం యజమాని గుర్రాల మోహన్ ఐదువేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. దాతలు సహాయం చేసి ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ప్లేట్లెట్స్ దానం చేసిన వెన్నెల నితీష్



ప్లేట్లెట్స్ దానం చేస్తున్న నితీష్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో డెంగ్యూ వ్యాధితో లో చికిత్స పొందుతున్న శిరీష అనే మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ ప్లేట్లెట్స్ ఆవసరం అని పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ ఆదివారం జిల్లా రక్తదాతల సేవా సమితి వారిని సంప్రదించారు. నిజామాబాద్ పట్టణానికి చెందిన వెన్నెల నితీష్ వెంటనే స్పందించి ప్లేట్లెట్స్ అందజేశారు. అత్యవసర సమయంలో స్పందించి ప్లేట్లెట్స్ దానం చేసిన నితీష్‌కు సేవా సమితి నిర్వాహకులు బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది,మరియు కొత్త నరేష్ ,పేషెంట్ బంధువులు కతజ్ఞతలు తెలిపారు.

ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ ఆటల పోటీలు ముగింపు



ఆటల్లో పాల్గొన్న పెన్షనర్స్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆవరణలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. యోగ, పాటల పోటీలు, స్కిల్ గేమ్స్, ఫాస్ట్ వాకింగ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులు సిర్ప హనుమాన్లు, అందె సాయిలు, దీకొండ లక్ష్మీనారాయణ, లావు వీరయ్య, లింగయ్య తదితరులు ఈ పోటీలను నిర్వహించారు. విజేతలకు డిసెంబర్ 19న న్యూ అంబేద్కర్ భవన్లో నిర్వహించనున్న పెన్షనర్స్ డే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు జిల్లా అధ్యక్షులు కే. రామ్మోహన్‌రావు తెలిపారు.

బాధితులకు చెక్కులను అందజేసిన ఎంపి



బాధితులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ అరవింద్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని పలువురి బాధితులకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి చెక్కులను ఆదివారం అందజేశారు. బూత్‌స్థాయి సభ్యుల సహాయ నిధి నుంచి మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన కంఠం రాజేశ్వర్ గుండెపోటుతో మరణించడం వల్ల వారి భార్య కంఠం లక్ష్మికి రూ. లక్ష, కృష్ణానగర్‌కు చెందిన దిదావత్ రమేష్‌కి గుండెపోటు వచ్చి స్టంట్ వేయించుకున్నందున రూ. 40 వేలు, ముత్యంపల్లి గ్రామానికి చెందిన తోట హరీష్ కుమారుడికి యాక్సిడెంట్ అయినందున రూ.10వేల చెక్కులను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి అందజేశారు. ఎటువంటి ఇబ్బందులు వచ్చినా మేమున్నామని బూత్ సభ్యుల కుటుంబాలకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు రామావత్ సురేష్ నాయక్, జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్, ఓబీసీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వినోద్ కుమార్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ.. కేసులు నమోదు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ లు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై శంఖర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపితే చట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన వాహనాల పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో 2 కేసులు నమోదుచేయగా వెహికల్ కు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో 6 కేసులు నమోదు చేసి పెనాల్టీ వేసినట్లు తెలిపారు. తనిఖీలో కానిస్టేబుల్స్ ప్రశాంత్, సాయి కుమార్, సదానంద్ పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

చేపల వేటకు వెళ్లిన ఒకరు మృతి చెందారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం... మండలంలోని తొర్లకొండ గ్రామానికి చెందిన అర్జున్ (45) శనివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి కనిపించకుండా పోయాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో శవం చెరువులో పైకి తేలడంతో పోలీసులు వచ్చి పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సొంత గూటికి బీజేపీ కార్పొరేటర్లు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఒకేరోజు నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆ పార్టీని వీడారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ సమక్షంలో ఆదివారం బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీలో చేరిన వారిలో బైకాన్ సుదా మధు, ఆకుల హేమలత శ్రీనివాస్, సుంకరి నారాయణ, మల్లేష్ యాదవ్ ఉన్నారు. అయితే గతంలో వీరంతా బీజేపీ నుంచి గెలిచిన వారే అయినప్పటికీ బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోగా.. అర్బన్ లో బీజేపీ నుంచి అర్బన్ ఎమ్మెల్యేగా ధన్ పాల్ సూర్యనారాయణ గెలిచిన అనంతరం బీజేపీ పార్టీ కార్పొరేటర్లు తిరిగి సొంత గూటికి చేరారు. ఈ కార్యక్రమం బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించడానికే వీక్షిత్ సంకల్ప యాత్ర

- గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ అశ్విన్ శ్రీ వాస్తవ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గ్రామాల్లో అవగాహన కల్పించడమే వీక్షిత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రెటరీ అశ్విన్ శ్రీ వాస్తవ అన్నారు .ఆదివారం డిచ్ పల్లి మండలంలోని మెంట్రాజ్ పల్లి గ్రామంలో భారత్ సంకల్ప యాత్రనును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో దూర దృష్టితో అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రధాని మోడీ తీసుకొచ్చిన ఎన్నో కార్యక్రమాలను దేశ ప్రజలందరికీ తెలిసే విధంగా రథయాత్రను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ వద్దకు వచ్చి మోడీ చేపట్టిన అన్ని కార్యక్రమాలను ప్రజలకు సవివరంగా తెలిసే విధంగా రథయాత్రను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీపీ గద్దె భూమన్న, సర్పంచ్ గోపాల చిన్న నర్సయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి టివిఎస్ గోపి బాబు,ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, జడ్పీ సీఇఓ గోవింద్, డీఆర్‌డిఓ పీడీ చందర్‌నాయక్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎస్‌ఈ కార్పొరేస్ ఈడీ రమేష్, ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలీ బెల్లాల్, వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి,బిల్ కలెక్టర్, షేక్ ఆసిఫోద్దిన్‌తో, పాటు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మోపాల్: కేంద్ర ప్రభుత్వం పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీపీవో జయసుధ అన్నారు. మండలంలోని కంజర్, కులాస్‌పూర్ తాండ గ్రామాల్లో ఆదివారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారత సంకల్ప యాత్రలో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ..కేంద్రప్రభుత్వ 17 రకాల పథకాలను నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని, అందులో ముఖ్యంగా అయుష్మాన్ భారత్, పిఎం ఆవాస్ యోజన పథకాలు ముఖ్యమైనవని తెలిపారు. నిరుపేదలందరూ దారిద్రరేఖకు దిగవనున్నవారు ఇంటిని నిర్మించడం కోసం ఆవాస్ యోజన కింద అప్లై చేసుకోవాలని, అలాగే ఆయుష్మాన్ భారత్ పథకంలో మన తెలంగాణ రాష్ట్రం కూడా చేరిందని, నిరుపేదలందరూ ఇటువంటి ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని డిపిఓ జయసుధ తెలిపారు. చాలా మట్టుకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వీటిపైన అవగాహన లేదని, అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ పథకాలపైన అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వారుఅన్నారు. ప్రచారంకోసం ప్రచార రథాలను కూడా ఏర్పాటు చేశామని, రోజువారి విధంగా ప్రతి మండలంలో రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చిత్రా మిశ్రా, డిఆర్డిఓ చందర్ నాయక్, జెడ్పి సీఈవో, ఎంపీడీవో లింగం నాయక్, ఎంపీఓ ఇక్బాల్, ఏపీఎం మోహన్, ఏపీఓ సునీత, సర్పంచులు భరత్, శ్రవణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

జక్రాన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం ఆదివారం అన్నారు. మండలంలోని మాదాపూర్ సికింద్రాపూర్ గ్రామాలలో వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు హాజరై వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన క్యాలెండర్లను అందజేశారు .అనంతరం దేశ అభి---వద్ధికి పాటుపడాలని ప్రతిజ్ఞ చేయించారు . కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల, ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం ఏపీఓ రవి, మాదాపూర్ సర్పంచ్ లింగన్న, సికింద్రాపూర్ సర్పంచ్ తలారి గంగామణి గంగాధర్, మాదాపూర్ సికింద్రాపూర్ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న, వైద్య సిబ్బంది మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : మాట్లాడుతున్న అశ్విన్ శ్రీ వాస్తవ,



మోపాల్‌లో...



జక్రాన్‌పల్లిలో...

బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం..

- మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం
- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రమాద వశాత్తూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కలి బుడిదైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతుల్లో చేసి చూపుతామని, బాధితులకు ఆదుకుంటామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఇందల్ వాయి మండలంలోని

దేవి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని గుడి తండా, యెల్లరెడ్డి పల్లి లో గత కొన్ని రోజుల క్రితం షాట్ షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గృహాలు కూలిపోయిన విషయం తెలుసుకుని బాధిత కుటుంబాలకు ఆయన ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నివాసపు ఇల్లు అగ్నిప్రమాదంలో కాలి బూడిద అయిందని, కుటుంబ సభ్యులు తినటానికి తిండి గింజలు లేక పస్తులుండి రోడ్డుపైన చెట్టు కింద తలదాచుకుంటున్నరన్న విషయం తెలుసుకుని ఇందల్ వాయి మండల అధికారులతో సమీక్షించామన్నారు. కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం తరపున 8000 వేల రూపాయలు, 25 కిలోల బియ్యం, సామగ్రి అందజేసినట్లు చెప్పారు. భాదిత కుటుంబానికి ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి తాను సహకారం అందించి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. తక్షణ సహాయంకింద శాసనసభ్యులు భూపతి రెడ్డి తన వంతుగా బాధితులకు 10 వేల రుపాయలు సహాయం అందించారు. ప్రగతి భవన్‌కు ప్రజా భవన్‌గా నామకరణం చేసి అక్కడ ఉన్న ఇనుప కంచెలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం రోజు బద్దలు కొట్టి సామాన్య ప్రజలు ప్రజా భవన్‌కు వచ్చి ప్రజావాణి లో వినతులను అందజేసే విధంగా చర్యలు చేపట్టారని వివరించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అరు గ్యారంటీ కార్డుల హామీలను వందరోజుల్లోనే ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని, అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు పథకాలు అమలు చేసి చూపామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగంగా 2009నుండి నమోదైన కేసులను విరమిస్తామని, ఇందిరమ్మ రాజ్యంలో అందరికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. పదేళ్ల పాలనలో అరాచకం, అంత ఇంత కాదని, అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే చేసి చూపామని చెప్పారు. పది, ఇంటర్ అపైన జరిగిన పరీక్షల పేపర్లను బజారులో దొరికే విదంగా చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడారని మండిపడ్డారు. ఆరోజే సరైన నిర్ణయం చేసి ఉంటే విద్యార్థుల జీవితాలు చిన్నా భిన్నం కాకుండా ఉండేవని, టిఎస్‌ఎస్‌పిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రక్షాళన చేపట్టారని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి,మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, పోలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, డాక్టర్ శాదుల్లా,మాజీ ఎంపిటిసిలు చింతల కిషన్, డాక్టర్ శ్రీనివాస్, బోర్ వెల్ రాజేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బైరయ్య డిసిసి డెలిగేట్ సుధాకర్, ఎన్ఎస్‌యుఐ రూరల్ కన్వీనర్ ఆశిష్, హబీబ్, మోహిసిన్, మోతిలాల్ నాయక్, ఎల్‌ఐసి గంగాధర్, శివారం మహారాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఎమ్మెల్యేను కలిసిన ప్రజాప్రతినిధులు, విడిసి సభ్యులు



ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి మాజీ ఎంపిటిసి చింతల కిషన్, బోర్వెల్ రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. తిర్మన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్ అధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటి సారిగా గ్రామం మీదుగా వెళ్తుండగా మాజీ ఎంపిటిసి చింతల కిషన్, రాజేందర్ రెడ్డి కలిసి ధర్పల్లి రాహదారికి ఆనుకుని ఉన్న రేణుకా ఎల్లమ్మ అలయాన్ని సందర్శించాలని కోరిన వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయన్ని నూతనంగా నిర్మించడానికి సహాయ సహకారాలు అందజేయాలని గ్రామ గౌడ సంఘ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వచ్చారు. అలయ విశిష్టత గురించి అడిగి తెలుసుకుని దేవాదాయ శాఖ నుండి నిధుల మంజూరు కు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్, డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, సంతోష్ రెడ్డి, కంచెట్టి గంగాధర్, డాక్టర్ శాదుల్లా, డాక్టర్ శ్రీనివాస్, బైరయ్య ఎల్‌ఐసి గంగాధర్, హబీబ్ ,ప్రవీణ్ గౌడ్,రాజ నర్స గౌడ్,జామ మాస్ జిద్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అహ్మద్, జంగిలి లక్ష్మి, మోహిసిన్, చెక్ పావర్ ఎర్రోళ్ల సాయన్న, మురళి గౌడ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాల్లో

ఓబీసీ 27శాతం కోటాను అమలు చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం 2014 నుండి ఐసిఎస్ఎస్ఆర్ నిధుల ద్వారా నిర్వహించే విద్య, ఉపాధి అవకాశాలలో ఓబీసీ లకు 27శాతం కోటాను అమలు చేయాలని తెలంగాణ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాదల్ లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం యూనివర్సిటీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2014 నుండి ఐసిఎస్ఎస్ఆర్ నిధుల ద్వారా నిర్వహించే విద్య ఉపాధి అవకాశాలలో ఓబీసీ 27శాతం కోటాను అమలు పరచకపోవడంతో చాలా మంది పరిశోధక విద్యార్థులు పరిశోధనలకు ఆర్థిక తోడ్పాటుకు దూరమయ్యారని పేర్కొన్నారు. సెమినార్స్, వర్క్ షాప్స్ మైనర్, మేజర్ ప్రాజెక్టుల్లో ఓబీసీ కోటా అమలు పర్చకపోవడం వల్ల ఓబీసీ అధ్యాపకులకు తీవ్ర మైన అన్యాయం జరిగిందని అన్నారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రసాద్ ఇప్పటికైనా స్పందించి బిజెపి ప్రభుత్వానికి ఓబీసీ కోటాను సంపూర్ణంగా అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం సభ్యులు శివకుమార్, సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

స్వర్గ రథం వితరణ



స్వర్గరథం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2003-04 పదవ తరగతి పూర్వ విద్యార్థులు గ్రామానికి స్వర్గ రథాన్ని వితరణ చేశారు. గ్రామంలో స్వర్గరథం లేని విషయం గమనించి గ్రామ ప్రజలు పడుతున్న ఇబ్బంధులను గుర్తించి స్వంత డబ్బులతో స్వర్గరథాన్ని చేయించి గ్రామాభివృద్ధి కమిటీకి అందించారు. ఈ మేరకు ఆదివారం పూజా కార్యక్రమాలను నిర్వహించి స్వర్గరథాన్ని గ్రామ అభివృద్ధి కమిటీకి అప్పగించారు. గ్రామస్థులందరు ఉచితంగా స్వర్గ రథాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఇతమంచి నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలోని యువకులందరు ఈ బ్యాచ్‌ని స్ఫూర్తిగా తీసుకుని మంచి మంచి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లౌడియా వసంత్, నోముల నరేందర్, సంధుల గంగారాం, లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

- పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు బి. సాయికృష్ణ రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు బి. సాయికృష్ణ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ జానాబాయి ఆధ్వర్యంలో ఆదివారం "ధ్యాన ఆత్మ జ్ఞాన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు బి. సాయికృష్ణ రెడ్డి, నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం చైర్మన్ తిరుమల గంగారాం హాజరయ్యారు. ఈ సందర్భంగా బి. సాయికృష్ణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క వ్యక్తి తూచా తప్పకుండా ప్రతి రోజు ధ్యానం చేయాలని, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని, శాఖాహారం భుజించాలని సూచించారు. ఈ నెల 21 నుండి 31 వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ పత్రీజీ శక్తి స్థల్ వద్ద జరిగే పత్రీజీ ధ్యాన మహాయాగం-2కు వేలాదిగా భక్తులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న 300 మంది ధ్యాన బంధువులకు పిరమిడ్ మాస్టర్ జానాబాయి 'ధ్యానామృతాన్ని' అందించారు. జ్ఞాన దాతలైన సునీత, నీలిమలు కార్యక్రమంలో పాల్గొని 'ఆత్మ జ్ఞాన' సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు నల్ల గంగారెడ్డి, విశ్రాంత జిల్లా పంచాయతీ అధికారి బొడ్డు దయానంద్, సభ్యులు డాక్టర్ అమరవాజి శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, కొత్తపల్లి రాజారెడ్డి, శేఖర్ రెడ్డి, ల్యాబ్ రవీందర్, అమృతరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయికృష్ణరెడ్డి

నవతెలంగాణ
కామారెడ్డి
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-మద్నూర్

ఈనెల 16న మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు ఆకస్మికంగా గుండెపోటు వచ్చి మృతి చెందిన తమ్మేవార్ భగవాన్ కుటుంబాన్ని ఆదివారం జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న భగవాన్ మృతి తీరని లోటని, కుటుంబం దిగులు చెందకూడదని, దేనికైనా తాను సహకరిస్తానని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు చౌలావార్ హనుమాన్ స్వామి, సచిన్, గడ్డంవార్ లక్ష్మణ్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ బండివార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మహా పడి పూజ



నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం లో సామూహిక మండల మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నాచారం పీఠాధిపతి మధుసూదనా నంద సరస్వతి స్వామి విచ్చేసి ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక మండల మహా పడిపూజతో పాటు ఉదయం ప్రత్యేక అభిషేకాలు పూజా కార్యక్రమం నిర్వహించా రు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మాలాధారణ స్వాములు పాల్గొన్నారు.

సర్పంచ్ బరిలో యువత

- జీపీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి
- రానున్న సర్పంచ్, వార్డు ఎన్నికల్లో పెరగనున్న పోటీ
- సీనియర్లకు షాక్ ఇవ్వనున్న యువకులు

నవతెలంగాణ-భిక్కనూర్

ఒకప్పుడు ఎన్నికలలో అనుభవం, డబ్బు, సీనియర్లు గలవారు మాత్రమే పోటీ చేసేవారు. ప్రస్తుతం కాలం మారింది. కష్టపడి చదువుకొని ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకునే యువత చదువుతోపాటు ఎన్నికల్లో పోటీ చేయడంపై ఆసక్తి చూపుతున్నారు. రానున్న సర్పంచ్ ఎన్నికలలో సీనియర్లపై పోటీ చేయాలనే లక్ష్యంతో యువకులు, నిరుద్యోగులు పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది.



ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యుల గ్రామపాలన సరిగ్గా లేని కారణంగా, ఉద్యోగాల కోసం ఎదురుచూసి అలసిపోయిన నిరుద్యోగులు, ఎన్నికలలో పోటీ చేసి సర్పంచ్ వార్డు సభ్యుల ఉద్యోగం సంపాదించి గ్రామ సమస్యలు పరిష్కరించి గ్రామ రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి నుండే గ్రామాలలో పావులు కదుపుతున్నారు. యువకులు వారి తల్లిదండ్రులను, స్నేహితులు, సమీప బంధువులను మచ్చిక చేసుకుని రానున్న సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలలో గెలుపు కోసం గ్రామాలలో కృషి చేస్తున్నారు. ఓటర్లు సైతం తమకు నచ్చిన వారికి ఓటు వేస్తున్న కారణంగా యువకులకు ఎన్నికలపై ఆసక్తి పెరిగింది. భిక్కనూరు మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో రానున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో యువకులు పోటీ చేసి గెలుపే లక్ష్యంగా ఎన్నికలకు బరిలోకి దిగనున్నారు. ఈ ఒక్క గ్రామమే కాకుండా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో నిరుద్యోగులు సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేయడానికి ముందుకు వస్తున్నట్లు సమాచారం.

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా ఏసిపి కిరణ్ కుమార్



పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఆదివారం తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పెన్షనర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏసిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులు వారి ఉద్యోగ కాలంలో చేసిన సేవలకు ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించిందని అన్నారు. పెన్షన్ అనేది ఎవరి బిక్ష కాదని అది వారి జన్మహక్కు అని అన్నారు. ఉద్యోగులు ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం అందించే పెన్షన్‌తో వారు ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా స్వేచ్ఛగా జీవించగలరని అన్నారు. ఈ వయసులో కూడా పెన్షనర్లు ఆనందమైన జీవనం గడపడం చాలా బాగుందని అభినందించారు. అనంతరం వారికి నిర్వహించిన పలు క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి జ్ఞాపికలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, పెన్షనర్ అసోసియేషన్ ప్రతినిధులు మురారి, రాజేశ్వర్, సాయిలు, ఏటిఓ వెంకటరమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాంషుగర్ ఫ్యాక్టరీపై కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదు

- సిఐటియు జిల్లా నాయకులు కుమారస్వామి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించడానికి ప్రభుత్వాలు కమిటీలు వేస్తామని చెప్పుకుంటూ కాలయాపన చేయడం సరికాదని, సంవత్సరాల తరబడి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికుల సమస్యలు ముందుగా పరిష్కరించి కమిటీలు వేసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు కుమరస్వామి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజాంషుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి ఒక కమిటీ వేసి నిపుణులతో, ఎమ్మెల్యేలతో ఫ్యాక్టరీలపై పూర్తి విచారణ జరిపించి ఫ్యాక్టరీలు నడపడానికి ఖరారు చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. 2002 సంవత్సరంలో టిడిపి ప్రభుత్వం మెదక్, మెట్‌పల్లి, బోధన్ యూనిట్లను జాయింట్ వెంచర్ పేరుతో ప్రైవేటుపరం చేసిందని తెలిపారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో షుగర్ ఫ్యాక్టరీ విషయంలో టిడిపి ప్రభుత్వం దీనిపై ఒక కమిటీ వేస్తున్నట్టు ప్రకటించిందని, దానిలో భాగంగానే ఒక సభా సంఘం వేసి దీనిపై పూర్తి సమాచారం సేకరించి తిరిగి ప్రభుత్వం పరం చేయాలని అప్పటి సభా సంఘం తమ నిర్ణయాన్ని ప్రభుత్వానికి సమర్పించిందన్నారు. ఆ సభా సంఘం నిర్ణయం మీద ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తిరిగి 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఫ్యాక్టరీని రాజకీయంగానే వాడుకున్నారు తప్ప దానిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా ఫ్యాక్టరీ లే ఆఫ్‌కు కారకులయ్యారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నిపుణులతో కూడిన కమిటీ వేస్తామని అసెంబ్లీలో చెప్పారని వివరించారు. ఫ్యాక్టరీపై కమిటీలు వేయడాన్ని వ్యతిరేకించడం లేదని కానీ 2015 డిసెంబర్ 23 నుంచి కంపెనీ లే ఆఫ్ అయి ఇప్పటి నుంచి కార్మికులకు వేతనాలు లేక, రిటైర్మెంట్ వచ్చినా ఎలాంటి బెనిఫిట్స్ తీసుకోకుండా కార్మికులు అనారోగ్యాల పాలై ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. కమిటీల ద్వారా కాలయాపన చేయకుండా కార్మికుల ప్రయోజనాలకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డుపై మురికి నీరు

- పూర్తిగా రోడ్డు లేకపోవడమే కారణం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో బీటీ రోడ్డు లేని కారణంగా గ్రామంలోని మురికి నీరు మొత్తం రోడ్డుపై వచ్చి చేరుతుంది. పెద్ద మల్లారెడ్డి గ్రామం నుంచి ఇసన్నపల్లి గ్రామానికి వెళ్లాలంటే మురికి కాలువలు దాటుకుని వెళ్లాల్సి వస్తుందని అటుగా వెళ్లే గ్రామస్థులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వెళ్లాలంటే ఆర్అండ్‌బీ అధికారులు బీటీ రోడ్డు వేస్తారు. కానీ ఇసన్నపల్లి గ్రామం నుంచి పెద్దమల్లారెడ్డి చెరువు కట్టవరకు మాత్రమే బీటీ రోడ్డు వేసి వదిలేశారు. చెరువు నుంచి గ్రామంలోపలికి సుమారు 200 మీటర్ల బీటీ రోడ్డు వేయని కారణంగా గ్రామం నుంచి వచ్చే మురికి నీరు మొత్తం రహదారిపై వచ్చి చేరుతుంది. సమస్య పరిష్కరించిన ప్రభుత్వం మారిన కారణంగా పనులు చేపడితే బిల్లులు వస్తాయో లేవోనని సర్పంచ్ ఆందోళన చెందుతున్నారు. బీటీ రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు సైతం



చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఒక మంత్రి వస్తే నిమిషాల్లో బీటీ రోడ్డు వేసి సమస్యలను పరిష్కరించే ఆర్అండ్‌బీ అధికారులు.. గ్రామస్తులు రోడ్డు లేక మురికి కాల్వ కారణంగా ఇబ్బందులు పడుతున్నా ఎందుకు పనులు చేపట్టడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంపీ బీబీ పాటిల్ సోదరుడి మృతి

- పాడె మోసిన ఎంపీ



నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సోదరుడు విట్టల్ రావు పాటిల్ మృతి చెందాడు. సోదరుని అంత్యక్రియల్లో ఎంపీ బీబీ పాటిల్ పాల్గొని పాడె మోశారు. బిబి పాటిల్ సోదరుడు మహారాష్ట్ర ప్రాంతంలో నివసించేవారు. ఆయన అనారోగ్యాల కారణంగా శనివారం మృతి చెందగా.. సొంత గ్రామమైన డోంగ్లి మండలం సిర్పూర్ గ్రామానికి తీసుకువచ్చి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీ బీబీ పాటిల్ సోదరుని అంత్యక్రియలకు జుక్కల్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

స్వచ్ఛభారత్‌లో యువత

- శ్రమదానంతో పరిసరాల పరిశుభ్రత



శుభ్రం చేస్తున్న యువత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్దికుంటలో బిజెపి నాయకులు, యువత కలిసి స్వచ్ఛభారత్‌లో భాగంగా ఆదివారం శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. గ్రామంలోని బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ, ఆంజనేయ ఆలయం గ్రామ నడిబొడ్డున ఉండడంతో పరిసరాలు ముండ్లపొదలు, చెత్తాచెదారం ఉండటంతో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పరిశుభ్రతను పెంపొందించాలని లక్ష్యంతో స్వచ్ఛభారత్‌లో భాగంగా శ్రమదానం చేశామని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రతి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి గ్రామ అధ్యక్షులు ముత్యాల రాజు, యువత బొమ్మిడి సంతోష్ రెడ్డి, ముదాం నర్సింలు, బస్వాపురం శ్రీనివాస్ గౌడ్, కుమ్మరి రాజశేఖర్, కుమ్మరి గంగరాజు, బొమ్మిడి సతీష్ రెడ్డి, బొమ్మిడి అంజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

జహీరాబాద్ ఎంపీ బి.బి పాటిల్ అన్న బి.బి విఠల్‌రావు పాటిల్ బస్వంత్ రావు పాటిల్ శనివారం రాత్రి చనిపోయారు. ఆదివారం జుక్కల్ నియోజకవర్గం డోంగ్లి మండలంలోని వారి స్వగ్రామం సిర్పూర్‌లో జరిగిన అంత్యక్రియలకు ఎల్లారెడ్డి నియోజకర్గ మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు.

సీజన్‌కు అనుగుణంగా పశువుల దాన మార్పిడి చేపట్టాలి

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావు

నవతెలంగాణ-కామారెడ్డి

మారుతున్న సీజన్‌కు అనుగుణంగా పంటల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో పాడిపశువుల విషయంలోనూ అవే జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి సింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణంగా శీతాకాలంలో పశువులు మేతమేయడానికి అంత ఆసక్తి చూపవని, దీని వల్ల పాల ఉత్పత్తి తగ్గుతుందని అందుకే పశువులకు అందించే దాణా విషయంలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా చలి పగటి సమయం తక్కువగా, రాత్రిలో ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పాలను ఉదయం 6 గంటల నుంచి 7 గంటల మధ్య, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య పితకడం మంచిదని సూచించారు. శీతాకాలంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటుందని, పశువుల శరీరం వేడిగా ఉంచేందుకు అవసరమైన ఆహారాన్ని సమీపంలోని పశువైద్యుని సలహాతో అందించాలని, లేకుంటే పశువులు మేత సరిగా తినక పాల ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చలికాలంలో దోమ కాటు, ఇతర వైరస్ వ్యాప్తి వల్ల గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులు రోగాల బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఆరుబయట పశువులను ఉంచిన షెడ్ల చుట్టూ వెచ్చగా ఉండేందుకు గోనెసంచులు కట్టాలని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ల సూచన మేరకు పశుదాణాలో పోషక విలువలు, మాంసకృత్తులు, శక్తిని ఇచ్చే పదార్థాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే పశువులకు పశువులకు గోరువెచ్చని నీటిని అందించాలని, నీటిని తొట్టిలోన ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలని పేర్కొన్నారు. చలికాలంలో పశువులకు గాలి కుంటు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని ముందుగానే ఈ వ్యాధికి సంబంధించిన టీకాను వేయించాలని సూచించారు. పాలు ఎక్కువగా ఇచ్చే పశువులకు మరిన్ని పోషకాలతో కూడిన దాణాను అందించాలని పశు వైద్యాధికారి సింహ రావు తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



నవతెలంగాణ-ఎల్లారెడ్డి

అనారోగ్యంతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందిన ఘటన మండలంలోని సోమార్‌పేట్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచే సాయిప్రసాద్ (45) ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉపాధి హామీలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. అనారోగ్యం వలన హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవటంతో ఆదివారం మరణించాడు. అంత్యక్రియలలో ఎంపీఓ, ఏపీఓ, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ సిబ్బంది గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా పోచారం సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని అమ్మ అనాథ ఆశ్రమంలో ఆదివారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల బిఆర్ఎస్ నాయకులు అమ్మ అనాథాశ్రమంలోని విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పత్తి లక్ష్మణ్ మాట్లాడుతూ సురేందర్‌రెడ్డి ప్రజలకు సేవ చేయడంలో ముందుంటారని ప్రతి ఒక్కరినీ వారి కుటుంబ సభ్యులుగా భావించి ముందుకు నడుస్తారని పేర్కొన్నారు. వారి జన్మదినం అనాథాశ్రమంలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.



అనాథాశ్రమంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ

గుండెపోటుతో ఉపసర్పంచ్ మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని రామలక్ష్మణ్‌పల్లి ఉపసర్పంచ్ రాజు శనివారం రాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఉపసర్పంచ్ రాజు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట గాంధారి, లింగంపేట్ మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రైస్ మిల్లులపై అసత్య ప్రచారాలు

- బీఆర్ఎస్ సీనియర్ నేత బుద్దె రాజేశ్వర్



నవతెలంగాణ-బోధన్

బోధన్ మాజీ శాసనసభ్యులు ఎండీ.షకీల్ అమెర్ రైస్ మిల్లులపై వివిధ ప్రసార మాధ్యాలలో వస్తున్న వార్తలు, ప్రకటనలు అవాస్తవమని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్ ఆదివారం ఖండించారు. మాజీ ఎమ్మెల్యే రైస్‌మిల్‌కు ప్రొక్యూర్మెంట్ ద్వారా ప్రభుత్వం పంపించిన ధాన్యాన్ని తిరిగి సీఎంఆర్ ద్వారా బియ్యాన్ని ఇచ్చారని తెలిపారు. మిగతా ధాన్యం ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరిగి వారు తెలిపిన రైస్ మిల్లులకు పంపినటుట తెలిపారు. గత ఖరీఫ్, రబి సీజన్‌లలో మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన రైస్ మిల్‌లకు ధాన్యం పంపొద్దని లిఖిత పూర్వకంగా ప్రభుత్వానికి లేఖ ఇవ్వడంతో, అధికారులు ఎటువంటి ధాన్యం పంపలేదని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై రాజకీయ కక్షతో కొన్ని ప్రసార మాధ్యమాలలో వార్తలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ అందుబాటులో లేరని, ఈ విషయంపై మాజీ ఎమ్మెల్యే వివరణ ఇస్తారని తెలిపారు. మాజీ శాసనసభ్యులు షకీల్‌కు సంబంధించిన రైస్ మిల్లులపై విచారణ చేపట్టడం రాజకీయ కక్ష అని ఆయన పేర్కొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

- పెరుగుతున్న కూలి రేట్లు



నవతెలంగాణ-లింగంపేట్

యాసంగిలో వరి నాట్లు ఊపందుకున్నాయి. దీంతో కూలీల రేట్లు పెరుగుతున్నాయి. చిన్న సన్న కారు రైతులు బోరుబావుల వద్ద చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో యాసంగిలో ముందస్తుగా వరి నారుమళ్ళు వేశారు. దీంతో వరి నారుమళ్లనాటు వేయడానికి సిద్ధంగా ఉండడంతో వారం రోజులుగా మండలంలో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు నిండిపోయాయి. భూగర్భజలాలు సమృద్ధిగా పెరిగాయి. ఈ నేపథ్యంలో చెరువుల్లో నీరు ఉండడంతో యాసంగి సాగుపై రైతుల ఆశలు పెట్టుకున్నారు. దీంతో రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు డిసెంబర్‌లో వరి నాట్లు వేయాలని ఆదేశించడంతో వరి నాట్లు వేస్తున్నారు. గత వారం రోజుల క్రితం కూలీలకు రూ.300 ఇచ్చేవారు. వారం రోజుల వ్యవధిలో కూలీ ధర రూ.400కు చేరుకుంది. మండలంలోని బానాపూర్, శెట్టిపల్లి, సంగారెడ్డి, లింగంపల్లి, పోల్కంపేట్, మంభోజిపేట, జల్దిపల్లి, రాంపూర్, కొండాపూర్, శెట్టిపల్లి, ఎక్కపల్లి, కోమటిపల్లి, పోతాయపల్లి, కన్నాపూర్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో వరి నాట్లు ఊపందుకున్నాయి.

IN THE COURT OF THE HONIBLE VII JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT ; AT HYDERABAD.
I A No. 269 of 2023
in
OS NO. 694 OF 2017

Between
M/s,Tril Biotech Pharmaceuticals Pvt.Ltd., ...Petitioner/ Plaintiff
And
M/s. Sri Balaji Medicals Agencies ...Respondent/Defendant

To,
M/s. Sn Balaji Medicals Agencies Rep. by its proprietor N, Srinivas, Nowat -4-6-96, near Devidas Hospital, Khasab Galli, Nizambad.

Whereas the Petitioner/Plaintiff herein has filed the petition for restoration of the suit to its original number and the notices repeatedly sent to you are returned unserved. You are hereby directed to appear before the Hon ble VII JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT ; AT HYDERABAD.. in person or through Advocate duly instructed, in IA No. 269/2023 in OS No.694/2017 duly instructed on 03-1-2024 at 10:30 a. m, failing which the matter will be heard and decided.

//By order of the Hon ble Court //
MOHD. IQBALUDDIN AHMED
Advocate for Plaintiff
Chambers at 4-1-109/110
Hanumantekdi, Abids,Hyderabad.
Mob. 9246150607

నవతెలంగాణ
నిజామాబాద్
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో పలువురి వివాహాల్లో మాజీ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర టిఎస్ఆర్టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొన్నారు. పాల్దా పిఎసిఎస్ చైర్మన్ జితేందర్ కూతురి వివాహంతో పాటు పలు వివాహ వేడుకల్లో కుటుంబ సమేతంగా హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు.

సామూహిక ఉపనయన మహోత్సవం

నవతెలంగాణ-కామారెడ్డి



శ్రీ రామకృష్ణ వైదిక పీఠం ఆధ్వర్యంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర ఆలయం దేవుని పల్లిలో వైదిక విద్య అభ్యసిస్తున్న పదిమంది విద్యార్థులకు వేద పాఠశాల నిర్వహకులు శీర్లవంచ కృష్ణమాచార్యులు, నాగరాజు ఆచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక ఉపనయన మహోత్సవం ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు సంగయ్య చారి, ఆలయ కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- అంతా ఉన్నత స్థాయిలోనే



ఇటీవల ఉన్నత హోదా పొందినవారిని సన్మానిస్తున్న తోటి స్నేహితులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని బర్ధిపూర్ శివారునగల హెూటల్ కృష్ణలో ఆదివారం నిజామాబాద్ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో (1994-97 బ్యాచ్) చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరు ఒకచోట కూడి చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ బ్యాచ్లో అత్యధికంగా ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారే ఎక్కువగా ఉన్నారు. మరికొంత మంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ బ్యాచ్‌లో డాక్టర్. మాలిక్(అసోసియేట్ ప్రొఫెసర్), గంగాధర్(డిఎస్పీ హైదరాబాద్, వినోద్ కుమార్ (ఆర్డీవో ఆర్మూర్), రాజేశ్వర్ (సహాయ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కార్యాలయం) తదితరులు ఉన్నారు. రావుట్ల నర్సయ్య సిరికొండలో సత్యశోధక్ పాఠశాల నిర్వహిస్తున్నారు. మరో 20 మంది వరకు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొందరు వివిధ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలుగా స్థిరపడ్డారు. సమ్మేళనంలో ఈ మధ్య ఉన్నత హెూదా పొందిన యం. గంగాధర్ డిఎస్పీ, టి. వినోద్ కుమార్ అర్డిఓ లను సన్మానించారు. సమ్మేళనం నిర్వహణలో రావుట్ల సత్యశోదక్ నర్సయ్య, డాక్టర్ యం. ఎ.మాలిక్, సత్యనారయణ, ఇబ్రహీం, గంగాధర్, చిరంజీవి ప్రధాన పాత్రను పోషించారు.

గోసంగిల హక్కులకోసం పోరాడుతా

- గోసంగి కుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక




ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-సిరికొండ

గోసంగి కుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మల్లెల సాయి చరణ్, ప్రధాన కార్యదర్శిగా సుంకర పెల్లి సాయన్న, గౌరవ అధ్యక్షులుగా సార్థన్ గంగ నర్సయ్య, ఉపాధ్యక్షులుగా అంకమొల్ల మోహన్, బెక్కం బాలయ్య, కోశాధికారిగా సార్ధన్ ధర్మపురి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుక్కు భాస్కర్, అంకమొల్ల శంకర్, అధికార ప్రతినిధిగా కదాసి రాఘవులు, ప్రచార కార్యదర్శిగా సార్ధన్ సదానంద్, అంకమొల్ల వెంకటేష్, సలహాదారులుగా సుక్క నడిపి నర్సయ్య, కుషన్ పల్లి నర్సయ్య, ఇసంపల్లి రామస్వామి, కార్యదర్శులుగా కుషన్ పెల్లి బాలు, బందెల నరేష్, శ్రీమంతుల రాజు, సభ్యులుగా దాసరి సాగర్ బందెల ధర్మపురి సిర్ర రాజన్నను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మల్లెల సాయి చరణ్ మాట్లాడుతూ రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న గోసంగి కుల సభ్యుల కు ధన్యవాదాలు తెలిపారు. గోసంగి హక్కులకై పోరాడతానన్నారు

బీజేపీ ఎమ్మెల్యేలకు సన్మానం



ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి

నవతెలంగాణ-కామారెడ్డి

నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలో గెలిచిన బిజెపి ఎమ్మెల్యేలను రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ సునీల్ బంసిలాల్ శాలువా కప్పి సన్మానించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమీక్ష, లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశం సందర్భంగా నిజామాబాద్ బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం ఉమ్మడి నిజామాబాద్ నుండి గెలిచిన బీజేపీ ఎమ్మెల్యేలను బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి సునీల్ బన్సల్ సన్మానించారు.

అయ్యప్ప మహా సామూహిక పడిపూజకు ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణలో సోమవారం జరిగే సామూహిక మహా పడి పూజ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆదివారం ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాములు కామారెడ్డి బిజెపి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డికి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డికి ఆలయ కమిటి ఆహ్వాన పత్రిక అందజేసింది. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. తప్పకుండా మహా పడిపూజకు వస్తానని తెలియజేయడంతో అయ్యప్ప స్వాములు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి కూడా తప్పకుండా వస్తానని హామీనిచ్చారు. కలిసినవారిలో అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి గోజే రాజేందర్ నాథ్, హనుమంతు హనుమంతప్ప గురుస్వామి, స్వాములు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న స్వాములు

డబుల్ ఇండ్లకు మోక్షం ఎప్పుడో..?

- సొంతింటి కోసం పేదల ఎదురు చూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఈప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై నిర్ణయం తీసుకుంటే తప్ప వీటిని కేటాయించే పరిస్థితి లేదు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల కింద ఇందిరమ్మ ఇండ్లపై నిర్ణయం తీసుకుంటే తప్ప వీటిని కేటాయించే పరిస్థితి లేదు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల కింద ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.. ప్రస్తుతం వంద రోజుల్లో గ్యారంటీల అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నందున ఈ ఇండ్లపై దృష్టిసారించి పేదలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇంటి స్థలంతోపాటు ఐదు లక్షల రూపాయలు అందిస్తామని హామీనిచ్చారు. ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితిపై మాత్రం అధికారులు ఏమి మాట్లాడడం లేదు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగానే వారు చర్యలు చేపట్టే అవకాశం ఉంది

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో..

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారు. మొత్తం ఆరు నియోజకవర్గాలు పరిధిలో 15వేల 304 ఇండ్లను మంజూరు చేశారు. వీటిలో బోధన్ నియోజకవర్గంలో 1712, బాన్సువాడ నియోజకవర్గం లో 4,988, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో1564, అర్బన్ నియోజకవర్గంలో 2,330, ఆర్మూర్ నియోజకవర్గంలో 2,130, బాల్కొండ నియోజకవర్గంలో 2,580 ఇండ్లను కేటాయించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 9267 ఇండ్లు మొదలు పెట్టగా వీటిలో 6,162 పూర్తి చేశారు. అయితే వీటిలో ఎక్కువ శాతం బాన్సువాడ నియోజకవర్గంలో 354 ఇండ్లను పూర్తి చేయడంతో పాటు లబ్ధిదారులకు కేటాయించారు.

నియోజకవర్గంలో

ఇండ్లు లేని అద్దె ఇండ్లలో ఉంటూ నరకయాతన అనుభవిస్తున్న పేద మధ్యతరగతి ప్రజలు నూతన ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సొంతింటి కల నెరవేర్చాలని గతబీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి గత సంవత్సరం దసరా వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన నత్త నడకన పనులు సాగి నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మొత్తం నియోజకవర్గంలో 2 130 ఇండ్లు



గుడారాల్లో ఉంటున్న పేదలు



నిర్మించిన డబుల్ బెడ్‌రూంలు

మంజూరు అయ్యాయి. పట్టణంలోని పోచమ్మగల్లి మామిడిపల్లి, పెరికిట్లలో మండలంలోని అంకాపూర్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయి తుదిదశకు వచ్చాయి. ప్రజా ప్రతినిధులు, అధికారుల పిలుపుతో రెండు పడక గదుల ఇళ్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తులు సమర్పించి సంవత్సరాలు గడుస్తున్నాయి. పట్టణంలోని పోచమ్మ గల్లి ,మామిడిపల్లి, పెరికిట్, మండలంలోని అంకాపూర్ లో నిర్మాణం అవుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఐదు, ఆరు వేలకుపైగా దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని వార్డుల వారీగా విభజించి ఇంటింటి సర్వే చేసి అర్హుల జాబితాను జిల్లా అధికారులకు సైతం పంపినట్లు స్థానిక అధికారులు చెబుతున్నారు. పట్టణంలోని 1 60 మంజూరు కాగా 136 నిర్మాణంలో ఉండగా, పెర్కిట్, మామిడిపల్లిలో వందకు వంద మంజూరై నిర్మాణం చేపట్టారు. మండలంలోని అంకాపూర్ గ్రామంలో 165 మంజూరు కాగా 116 నిర్మాణంలో ఉన్నవి.. స్థానిక ఎమ్మెల్యేగా గెలుపొందిన పైడి రాకేష్ రెడ్డి స్పందించి త్వరగా అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ ఇండ్లు అందేలా చూస్తా



నియోజకవర్గంలో ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ లు ఇచ్చేందుకు కృషి చేస్తాను.
పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్యే, ఆర్మూర్.

ఇండ్లు లేని వారిని గుర్తించి ఇవ్వండి



20 సంవత్సరాల నుండి అద్దె ఇళ్లల్లో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అర్హులను గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేయండి.
వడ్లూరి ద్రోణ చారి, ఆర్మూర్

వేద పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని రామడుగు గ్రామంలో ఓంప్రకాష్ అనే స్థానిక వేదంతుడు ఏర్పాటు చేసిన వేదపాఠశాలను ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో గోశాలను ప్రారంభించారు. అనంతరం యజ్ఞం చేశారు. ఈసందర్భంగా వేదపండితులు ఎమ్మెల్యేను రాజకీయంలో సమర్ధవంతంగా ముందుకు వెళ్లాలని ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశ గొప్ప సంస్కృతిని ముందుకు తీసుకెళ్ళేదిశగా మారుమూల ప్రాంతంలోని గ్రామస్తుడు తన సొంత భూమిలో వేద పాఠశాల, గోశాల ఏర్పాటుకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమము తన చేతుల మీదుగా ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. తమ పిల్లలకు వేదాలు నేర్పించాలనుకునే తల్లి తండ్రులకు ఇది గొప్ప వరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం దుబ్బాక గ్రామ చర్చి ఫాదర్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, హొన్నాజిపేట్ సర్పంచ్ భగవాన్‌రెడ్డి, రామడుగు సర్పంచ్ సుబేందర్, నాయకులు సుభాష్‌రెడ్డి, జాన్‌రెడ్డి, గుట్ట గంగాధర్, మహేందర్, మిట్ట పల్లి గంగారెడ్డి, మనోహర్ రెడ్డి, దూమల రవి, నర్సారెడ్డి, మహిపాల్ రెడ్డి, విడిసి సభ్యులు రాజన్న, కార్యకర్తలు, వేద పండిత బృందం, వేద పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందిన రూరల్ ఎమ్మెల్యే డా భూపతిరెడ్డి మొదటిసారిగా గ్రామానికి రావడంతో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున స్వాగతం పలికారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని పలు వివాహ శుభకార్యాల్లో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అయన వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముప్ప గంగారెడ్డి, గుట్ట గంగాధర్, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్మైల్, కాంతి పాఠశాలలకు ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని స్మైల్స్, పెర్కిట్ కాంతి పాఠశాలలకు ఎక్స్‌లెన్స్ అవార్డులు పొందారు. బ్రెయిన్ ఫీడ్ వారి అవార్డు ఫంక్షన్‌లో భారతదేశంలోనే అత్యుత్తమమైన పాఠశాలల్లో ఒకటిగా కాంతి హై స్కూల్‌కు స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందింది. కార్యక్రమంలో ఎంతో మంది ప్రముఖులు పాల్గొని పాఠశాల కరస్పాండెంట్ కాంతిగంగారెడ్డి డైరెక్టర్ శశాంక్‌ని వారి కృషికి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా తమతో ప్రయాణం చేసిన తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి ఈ అవార్డుని అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎన్నో అవార్డులు అందుకోవడానికి నిరంతరం కృషి చేస్తామని దానికి అందరి సహకారం ఇలాగే కొనసాగేటట్టుగా చూడాలని కోరారు.

స్మైల్స్ పాఠశాలకు..

బ్రెయిన్ ఫీడ్ మ్యాగజిన్ వారి ఆధ్వర్యంలో టాప్ 100 ప్రీ స్కూల్స్ అవార్డు ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి పాఠశాలలు పాల్గొన్నారు. ఇందులో పట్టణానికి చెందిన స్మైల్స్ ద స్కూల్ మూడోసారి ఈ అవార్డ్స్ వచ్చిందని సంతోషం వ్యక్తంచేస్తున్నట్టు డైరెక్టర్ రఫీ గోహర్ ఆదివారం తెలిపారు. బ్రెయిన్ ఫీడ్ మ్యాజిక్ వ్యవస్థాపకుడు సీతఊట కాకాని బ్రహ్మంగారి చేతుల మీదుగా అందుకున్నారు ఈ అవార్డుకోసం కృషి చేసి ఉపాధ్యాయులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డును అందుకుంటున్న కాంతి పాఠశాల యాజమాన్యం

రాబరీ కేసును 24 గంటల్లో చేధించిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో రాబరీ కేసును పోలీసులు 24 గంటల్లో చాకచక్యంగా వ్యవహరించి చేధించారు. కేసు వివరాల్లోకి వెళితే ఇంద్రాల కళ్యాణ్, మద్రేపల్లి రాకేష్, తాడెం శోభ, ముక్క జమున అనే నలుగురు చెడు అలవాట్లకు బానిస అయ్యారు. శివాజీ నగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటున్న గోపు గంగమ్మ అని వృద్ధురాలికి ఎవరూ లేకపోవడంతో రెక్కి నిర్వహించారు. ఆమె వద్ద ఉన్న బంగారం నగదును ఎలాగైనా దొంగతనం చేయాలని పథకం వేశారు. ఈనెల 15న మధ్యాహ్నం ఎవరూ లేని సమయం చూసి రాకేష్, జమున,



వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

గంగమ్మ ఇంటికి ఒకవైపు శోభ ఇంటికి మరోవైపు రెక్కి నిర్వహించగా కళ్యాణ్ ఇంట్లోకి చొరబడ్డాడరు. బాధితురాలు యొక్క మెడలో ఉన్న 2.2 తులాల బంగారం గొలుసు, 10వేల నగదు దొంగలించుకుని పారిపోయారు. విషయం తెలుసుకున్న బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 24 గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును చేదించారు. ఈ కేసులో టూ టౌన్ పోలీసులు సిసి కెమెరాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడి చేధించారు. కేసును చేదించినందుకు అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ జయరాం, ఏసిపి కిరణ్ కుమార్ కేసు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అయిన సిఐ నరహరి ని, కేసును డిటెక్ట్ చేయడంలో సహకరించిన రెండవ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ అశోక్, వారి సిబ్బందిని అభినందించారు.

నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్‌కు ఆక్స్‌ఫర్డ్ విద్యార్థి

- రాష్ట్ర బేస్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు ధర్మారం (బి), మిట్టాపల్లి విద్యార్థినిలు
- అభినందించిన పాఠశాలల యాజమాన్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అబ్దుల్ అల్యాఫీ నేషనల్ ఇంటర్ డిస్టిక్ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ 2023-24 లో నిర్వహించిన పోటీల్లో జావలిన్ త్రో విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. పాఠశాల యాజమాన్యం మామిడాల మోహన్ అభినందించారు. ఆదివారం పాఠశాల ఆవరణంలో ఘనంగా సన్మానించి నేషనల్ లెవెల్‌లో అథ్లెటిక్స్ విభాగంలోని జావిలిన్ త్రోకు సెలెక్ట్ అయినందుకు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. పాఠశాలతోపాటు నిజామాబాద్ జిల్లా, తల్లిదండ్రులకు సైతం గుర్తింపు తీసుకువస్తానని అల్యాఫీ మాట ఇచ్చారు.

డిచ్‌పల్లి : ఈనెల 16 నుండి 18 వరకు జరుగనున్న 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ బేస్ బాల్ అండర్-17 పోటీలకు డిచ్ పల్లి మండలం లోని ధర్మారం బి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు నక్షత్ర, శరణ్య నూ పాఠశాల ప్రిన్సిపల్ సంగీత ఆదివారం అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగీత మాట్లాడుతూ క్రిడ పోటీల్లో తమ సత్తా చాటాలని పేర్కొన్నారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరాజా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభను కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావాలని విద్యార్థులకూ సూచించారు.ఈకార్యక్రమంలో పిఈటీ జోష్న, హౌస్ టీచర్స్ విద్యార్థులను అభినందించారు.

ఈనెల 16 నుండి 18 వరకు మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరుగుతున్న 67వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ బేస్ బాల్ అండర్-17 పోటీలకు డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాకారులు బాలుర విభాగంలో రాథోడ్ మురళి, కొమిరె విష్ణు, బాలికల విభాగంలో కొమిరె గంగా జమున, గాండ్ల రసజ్ఞ పాల్గొంటున్నట్లు ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగా మోహన్ తెలిపారు.ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ ఉపాధ్యాయ బృందం అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు.



డిచ్‌పల్లి :ఎంపికైన ధర్మారం విద్యార్థులు



డిచ్‌పల్లి :మిట్టపల్లి విద్యార్థులు



కంఠేశ్వర్ : నేషనకు ఎంపికైన విద్యార్థి